క్లుప్తంగా

మండల అభివృద్ధికి కృషి


ఎంపీడీఓ రఘురాం అభినందిస్తున్న ఈఓపీఆర్‌డీ ప్రసాద్, కార్యాలయ సిబ్బంది

వల్లూరు: ప్రజా ప్రతినిధులు, అధికారుల సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీడీఓ జీవీ రఘురాం తెలిపారు. వల్లూరు ఎంపీడీఓగా జీవీ రఘురాం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీఓగా పని చేస్తున్న జయశ్రీ పుల్లంపేటకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో పుల్లంపేట ఎంపీడీఓగా పని చేస్తున్న రఘురాంను వల్లూరుకు బదిలీ చేశారు. అనంతరం ఈఓపీఆర్‌డీ ప్రసాద్, కార్యాలయ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

ఈ–క్రాప్ నమోదు పరిశీలన


ఈ–క్రాప్ నమోదును పరిశీలిస్తున్న తహసీల్దార్ గురప్ప

సింహాద్రిపురం : మండలంలోని కసనూరు, అంకాలమ్మగూడూరు గ్రామాల్లో సోమవారం సాయంత్రం ఈ–క్రాప్ నమోదు ప్రక్రియను తహసీల్దార్ గురప్ప పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ–క్రాప్ బుకింగ్ ఏ మేరకు చేస్తున్నారు, పంట సాగు విస్తీర్ణం, సర్వే నంబర్లను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో వీహెచ్ఏలు, వీఏఏలు, ఏఎస్ఓ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై డ్రిప్ పరికరాలు


రైతులకు డ్రిప్ పరికరాలు అందజేస్తున్న ఏఓ, కంపెనీ ప్రతినిధులు

వేముల : ప్రభుత్వం సబ్సిడీతో ఇస్తున్న డ్రిప్ పరికరాలన రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ చెన్నారెడ్డి సూచించారు. సోమవారం వేములలోని మేఘ కంపెనీ ఆధ్వర్యంలో సబ్సిడీ ద్వారా అందిస్తున్న డ్రిప్ పరికరాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు సూక్ష్మ సేద్య పరికరాలను సబ్సిడీతో అందిస్తోందని, డ్రిప్ పరికరాలు కావాల్సిన రైతులు ఆర్ఎస్కే వద్ద సంప్రదించాలని సూచించారు. ఐదు ఎకరాల వరకు 90 శాతం, ఐదు నుంచి 10 ఎకరాలకు 70 శాతం, 10 ఎకరాలకుపైన పొలం ఉన్న రైతులకు 50 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు అందజేస్తామని పేర్కొన్నారు. రైతులు తమ వాటా సొమ్ము కట్టిన వారం రోజుల్లోనే డ్రిప్ పరికరాలు అందిస్తారని తెలిపారు.

టిడ్కో ఇళ్లు పంపిణీ చేయాలి


ఆర్డీఓకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

జమ్మలమడుగు: లబ్ధిదారులకు గూడెంచెరువు సమీపంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను పంపిణీ చేయాలని సీపీఎం నాయకుడు ఏసుదాసు ఆర్డీఓ సాయిశ్రీకి వినతిపత్రం అందజేశారు. సోమవారం ఆర్డీఓకు వినతి పత్రం ఇచ్చిన అనంతరం ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు డబ్బులు కట్టాలంటూ బ్యాంక్ అధికారులు నోటీసులు పంపుతున్నారని పేర్కొన్నారు. ఇళ్ల పంపిణీ చేయకుండానే నోటీసులు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. మౌలిక సదుపాయాలు కల్పించి బాధితులకు పట్టాలు పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దాసరి విజయ్, అబ్రహాం పాల్గొన్నారు.

ఆర్డీఓను కలిసిన మున్సిపల్ చైర్మన్


ఆర్డీఓ భానుశ్రీని కలిసిన మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, కౌన్సిలర్లు

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని మినీ సెక్రటరియేట్‌లోని ఆర్డీఓ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు తీసుకున్న ఆర్డీఓ భానుశ్రీ అన్నపూర్ణ ప్రత్యూషను సోమవారం మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజ్, కౌన్సిలర్లు పార్నపల్లె కిశోర్, ఖాదర్ బాషా, కోఆప్షన్ చంద్రమౌళి మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకేలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పులివెందులలో రెవెన్యూ లోటుపాట్లు లేకుండా అన్ని విధాలా సహకరించాలని కోరారు.

అన్న క్యాంటీన్ ప్రారంభం

ఎర్రగుంట్ల : యర్రగుంట్ల నగర పంచాయతీ పరిధిలోని వేంపల్లి రోడ్డులోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను సోమవారం ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ప్రారంభించారు.

కొత్త పింఛన్లు లేనట్టేనా..?

- కొత్త పింఛన్ కోసం లబ్ధిదారులు ఎదురుచూపులు
- ఓపెన్ కాని వెబ్‌సైట్
- ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ అందజేస్తామని కూటమి నేతల హామీ
- అధికారులు, కూటమి నాయకుల చుట్టూ అర్హుల ప్రదక్షిణలు


పింఛన్ల దరఖాస్తులతో లబ్ధిదారులు (ఫైల్)

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణానికి చెందిన ఓ వ్యక్తి వయస్సు 53 ఏళ్లు. కూటమి నేతలు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ అందజేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సదరు వ్యక్తి సచివాలయానికి వెళ్లి పింఛన్ దరఖాస్తు ఎప్పుడు తీసుకుంటారు సార్.. అని అక్కడి సిబ్బందిని ఆరా తీశాడు. వెబ్‌సైట్ ఇంకా ఓపెన్ కాలేదని చెప్పడంతో ఈ ఏడాది పింఛన్ లేనట్టేనా సార్ అంటూ నిరాశతో వెనుతిరిగాడు. ఇది ఆ ఒక్క వ్యక్తి పరిస్థితే కాదు చాలా మంది వృద్ధులు, వితంతువులు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు మండల వ్యాప్తంగా సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అక్కడ నిరాశ ఎదురుకావడంతో అధికార పార్టీ నాయకులను ప్రసన్నం చేసుకునేందుకు ప్రదక్షిణలు చేస్తున్నారు.

ఎదురుచూపులు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువదీరి నాలుగు నెలలవుతోంది. ఇంత వరకు కొత్త పింఛన్ల పంపిణీపై కార్యాచరణ రూపొందించలేదు. అక్టోబర్ నుంచి కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని ప్రభుత్వ పెద్దలు ప్రకటించారు. ఈ నేపథ్యంలో అర్హులైన లబ్ధిదారులు పింఛన్ల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వంలో రాజకీయాలు, పార్టీలకు సంబంధం లేకుండా గ్రామ వార్డు సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే పింఛన్లు మంజూరయ్యేవి. అయితే కూటమి ప్రభుత్వం పింఛన్లపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో గత ప్రభుత్వంలో పింఛన్ కోసం దరఖాస్తుల చేసుకున్న వారికి కూడా ఎదురుచూపులు తప్పడం లేదు.

అర్హులు ఆవేదన

అర్హులైన వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులు కొత్త పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు వార్డు, గ్రామ సచివాలయాలకు రోజూ పదుల సంఖ్యలో లబ్ధిదారులు వెళ్తున్నారు. నూతన పింఛన్లకు దరఖాస్తు చేసుకునేందుకు ఇప్పటి వరకు సంబంధిత వెబ్‌సైట్ ఓపెన్ కాకపోవడంతో నిరాశతో వెనుదిరగాల్సి వస్తోంది. ప్రభుత్వం నుంచి సమాచారం అందలేదని సచివాలయ సిబ్బంది చెబుతున్నారని అర్హులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత ప్రభుత్వంలో..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పింఛన్ కోసం నిత్యం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశముండేది. దరఖాస్తు చేసుకున్న వారికి ప్రతి ఆరు నెలలకోసారి లబ్ధిదారులను గుర్తించి మంజూరు చేసేవారు. ఈ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగింది. కానీ నేడు ఆ పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వం పింఛన్లు, రేషన్ కార్డు వెబ్‌సైట్‌ను పూర్తిగా నిలిపివేసింది.

సూపర్ సిక్స్ ఓ బూటకం



ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం విస్మరించింది. సూపర్ సిక్స్ అమలు ఓ బూటకం. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలను నమ్మించి మరోసారి మోసం చేశాడు. అధికారం చేపట్టి నాలుగు నెలలు అవుతున్నా.. పింఛన్ వెబ్‌సైట్ తెరుచుకోలేదు. ప్రతి గ్రామంలో వార్డులలో పదుల సంఖ్యలో అర్హులు నూతన పింఛన్ కోసం ఎదురు చూస్తున్నారు. కొత్త పింఛన్లు మంజూరులో జాప్యం తగదు. ప్రభుత్వ పెద్దలు ప్రకటనలు, ఆరోపణలు, అసత్య ప్రచారాలకే పరిమితమవుతున్నారు.

డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, యర్రగుంట్ల

ప్రతి రైతుకు శనగ విత్తనాలు అందిస్తాం


వేములలో శనగ విత్తనాల రిజిస్ట్రేషన్‌ను పరిశీలిస్తున్న ఏఓ చెన్నారెడ్డి

వేముల : రబీలో పంట సాగు చేసే ప్రతి రైతుకు సబ్సిడీ శనగ విత్తనాలను అందిస్తామని ఏఓ చెన్నారెడ్డి తెలిపారు. సోమవారం వేములలోని రైతు సేవా కేంద్రంలో విత్తనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 25 శాతం సబ్సిడీతో శనగ విత్తనాలను మంజూరు చేసిందన్నారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలలో సోమవారం నుంచి వీఏఏ, వీహెచ్ఏలు శనగ విత్తనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించారని తెలిపారు. ఎకరాకు ఒక ప్యాకెట్ చొప్పున శనగ విత్తనాలు ఇస్తామని, 5 ఎకరాలు ఉన్నట్లయితే 10 ప్యాకెట్లు ఇస్తామని పేర్కొన్నారు. మండలానికి 2,876 క్వింటాళ్లు మంజూరయ్యాయని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రత్యేక పూజలు

కమలాపురం: ఆర్టీసీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు దుగ్గాయపల్లె మల్లికార్జున రెడ్డి పట్టణంలోని కన్యకాపరమేశ్వరీ దేవి శరన్నవ రాత్రి మహోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం రాత్రి ఆర్యవైశ్య నాయకుల పిలుపు మేరకు అమ్మవారిని దర్శించుకున్నారు. నిర్వాహకులు ఆయనను ఘనంగా సత్కరించారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

పెండ్లిమర్రి: మండలంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని సోమవారం కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ అనురాధతో మాట్లాడుతూ ప్రజల వినతులు, భూసమస్యలు ఎమైనా పెండింగ్ ఉంటే వెంటనే వాటిని పరిష్కరించాలని సూచించారు. ఫ్రీ హోల్డ్ భూముల రివెరిఫికేషన్ ప్రోగ్రెస్ గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీను, వీఆర్వోలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక


బంగారు పతకం సాధించిన సాయి

కమలాపురం: స్థానిక పీవీఎస్ఆర్ఎం జూనియర్ కళాశాలకు చెందిన బి. సాయి, జి.నందిని అనే విద్యార్థులు అథ్లెటిక్స్‌లో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ ఖాదర్ రెడ్డి తెలిపారు. ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు రాజమండ్రిలో ఆర్ట్స్ కళాశాల మైదానంలో అండర్–16, అండర్–20 విభాగాల్లో జరిగిన రాష్ట్ర స్థాయి రిలే పరుగు పోటీల్లో వారు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. అండర్–16 విభాగంలో సాయి 600 మీటర్ల పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచాడు. అలాగే నందిని అండర్–20 విభాగంలో పరుగు పందెంలో ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈ నెల 17 నుంచి గుంటూరులో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు వారు ఎంపికైనట్లు కోచ్ తెలిపారు. కాగా సోమవారం కళాశాల కరస్పాండెంట్ రాజగోపాల్ రెడ్డి, ప్రిన్సిపాల్ రమణారెడ్డి సాయి నందినితో పాటు కోచ్ ఖాదర్‌రెడ్డిని అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం

పులివెందుల రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ప్రకటించారు. పులివెందుల పట్టణంలోని తన స్వగృహంలో సోమవారం ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు వివిధ సమస్యలు పరిష్కరించాలని తమ దృష్టికి తీసుకువచ్చారని, సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

వేంపల్లె : వేంపల్లె మండలంలోని పాములూరు వద్ద ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ కాలువ పనులు త్వరితగతిన పూర్తి చేయడానికి ప్రయత్నిస్తామని ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం చక్రాయపేటలోని కాలేటి వాగు, పాములూరు వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ కాలువలను పరిశీలించారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

వేంపల్లె : పట్టణంలోని రైతు బజార్‌ను తెరిపించని అధికారులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం కడప జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ అతిథి సింగ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు మండలాల కూడలిగా ఉన్న వేంపల్లె పట్టణంలో రైతులు తాము పండించిన పంటను నేరుగా విక్రయించేందుకు గత ప్రభుత్వం రూ.1.20 కోట్లతో రైతు బజార్ నిర్మించిందని తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతు బజార్ ప్రారంభానికి నోచుకోలేదని మండిపడ్డారు. ఆయన వెంట బీజేపీ నాయకులు రామచంద్రారెడ్డి, లక్ష్మణరావు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

వల్లూరు (చెన్నూరు) : ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దారు సరస్వతి తెలిపారు. చెన్నూరు మండలం తహసీల్దారుగా సరస్వతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఖాజీపేట మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ చెన్నూరుకు బదిలీపై వచ్చారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న జీవన్ చంద్రశేఖర్ కడప కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు.

బాధ్యతలు చేపట్టిన తహసీల్దారు

ముద్దనూరు: మండల తహసీల్దారుగా (ఎఫ్ఏసీ) వరద కిషోర్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా కార్యాలయం డిప్యూటీ తహసీల్దారుగా నియమితులైన వరద కిషోర్‌రెడ్డి తహసీల్దారుగా పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టారు.

బాధ్యతలు స్వీకరించిన అధికారులు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మండలానికి చెందిన పలువురు అధికారులు సోమవారం విధుల్లో చేరారు. పంచాయతీ రాజ్ ఏఈగా గణేష్, ఈఓపీఆర్డీగా రామాంజనేయరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. సోములవారిపల్లె గ్రామ పంచాయతీ కార్యదర్శిగా రాజేంద్రప్రసాద్, దొరసానిపల్లె గ్రామ పంచాయతీ కార్యదర్శిగా సాంబశివారెడ్డి, కొత్తపల్లె గ్రామ పంచాయతీ కార్యదర్శిగా రామ్మోహన్‌రెడ్డి, చౌటపల్లె గ్రామ పంచాయతీ కార్యదర్శిగా బి.శిరీష, చౌడూరు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా భాగ్యలక్ష్మి, కల్లూరు పంచాయయతీ కార్యదర్శిగా ధనుంజయ బాబు విధుల్లో చేరారు. మండల పరిషత్ కార్యాలయ అటెండర్లుగా శ్రీను, సుబ్బరాయుడు విధుల్లో చేరారు. అనంతరం ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డిని కలిశారు.

ప్రొద్దుటూరు కమిషనర్‌గా మల్లికార్జున

ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్‌గా మల్లికార్జున సోమవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ధర్మవరం మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న ఆయన ప్రొద్దుటూరుకు రాగా, ఇక్కడ పని చేస్తున్న కమిషనర్ రఘునాథరెడ్డిని బాపట్లకు బదిలీ చేశారు.

పోరుమామిళ్ల ఎంపీడీఓగా రమణారెడ్డి

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల మండల అభివృద్ధి అధికారిగా ఆర్.రమణారెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న వరప్రసాదరావు కర్నూలు జిల్లాకు బదిలీ అయ్యారు. మైదుకూరు మండలంలో పంచాయతీ రాజ్ విస్తరణాధికారిగా పని చేస్తున్న రమణారెడ్డి బదిలీలో భాగంగా ఇక్కడకు ఎంపీడీఓగా వచ్చారు.

టీడీపీవి కుటిల రాజకీయాలు

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి



కమలాపురం: టీడీపీకి పూర్తి స్థాయి మెజార్టీ ఉన్నప్పటికీ కుటిల రాజకీయాలు చేస్తోందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి విమర్శించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కమలాపురం మున్సిపల్ కౌన్సిలర్లు టీడీపీకి అవసరం లేక పోయినా డైవర్షన్ రాజకీయాల కోసం తీసుకున్నారని మండిపడ్డారు. జగనన్న సారథ్యంలో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఎంతో మంది నాయకులు ఎదిగారని తెలిపారు. పార్టీలోకి ఎంతో మంది వస్తుంటారు.. పోతుంటారని, కార్యకర్తలే పార్టీకి పునాది అని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తిరిగి సత్తా చాటుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఎవరూ అధైర్య పడాల్సిన అసవరం లేదన్నారు. నాలుగు నెలలకే కూటమి పాలనతో ప్రజలు విసిగెత్తిపోయారని, ఒక్క పథకం కూడా అమలు చేయలేదని ఆరోపించారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా ప్రజలు జగనన్నకే పట్టం కడతారని ధీమా వ్యక్తం చేశారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి


వైఎస్సార్‌సీపీ కార్యకర్తను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. మండల పరిధిలోని హనుమనుగుత్తి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త వెంకటరాముడును ప్రొద్దుటూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నాడు. సోమవారం ఆస్పత్రిలో వెంకటరాముడును సుధీర్‌రెడ్డి పరామర్శించి, ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ నాయకులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని తెలిపారు. బాధితుడు వెంకటరాముడిని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఆయన చెప్పారు. హనుమనుగుత్తి గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీపీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి


జెన్‌కో డైరెక్టర్ అశోక్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

ఎర్రగుంట్ల : ఆర్టీపీపీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం ఆర్టీపీపీకి వచ్చిన ఏపీ జెన్‌కో డైరెక్టర్ (థర్మల్) అశోక్‌కుమార్‌రెడ్డికి ఏపీ ఎలక్ట్రిసిటీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వి. సుబ్బిరెడ్డి వినతిపత్రం అందజేశారు. అనంతరం సుబ్బిరెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికుల్లో అనేక మంది ఐటీఐ, డిగ్రీ, డిప్లొమా తదితర విద్యార్హతలు ఉన్న అన్‌స్కిల్డ్ వేతనాలు ఇస్తున్నారని తెలిపారు. పర్మినెంట్ ఉద్యోగులకు విడతల వారీగా అరియర్స్ బకాయిలు చెల్లిస్తున్నారని, కాంట్రాక్ట్ కార్మికులకు అరియర్స్ ఇవ్వకపోవడం అన్యాయమని పేర్కొన్నారు.

నీరు విడుదల చేయండి

ఎర్రగుంట్ల : వామికొండ రిజర్వాయర్ ఆయకట్టుకు నీరు విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి అన్నారు. సోమవారం యర్రగుంట్ల పట్టణంలోని విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సమితి ఆధ్వర్యంలో వామి కొండ రిజర్వాయర్ పంట కింబు కాలువలు నిర్మించాలని కోరుతూ ఈ నెల 9వ తేదీన చిలంకూరులో సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. వామికొండ రిజర్వాయర్‌లో నీళ్లు ఉన్నప్పటికీ రైతుల పొలాలకు నీరు అందించలేని పరిస్థితి నెలకొందని చెప్పారు. ఇప్పటికైనా వామికొండ రిజర్వాయర్ కింద పంట కాలువలు పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాతో అంతరాయం

లింగాల : లింగాల మండలంలో తాతిరెడ్డిపల్లె సబ్ స్టేషన్ పరిధిలోని 11 కె.వి తాతిరెడ్డిపల్లె గ్రామం, నేర్జాంపల్లె ఫీడర్ల పరిధిలో చెట్ల తొలగింపు కారణంగా మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని విద్యుత్ ఏఈ బాల సంజీవులు తెలిపారు.

పులివెందుల రూరల్ : 11 కె.వి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రభుత్వాసుపత్రి ఫీడర్ కింద లైన్ల మరమ్మతుల కారణంగా పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి, సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్, జెండామానువీధి, రోటరీపురం, శ్రీనివాస హాలు రోడ్డు తదితర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని జేఈ రమేష్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు.

కల్పవల్లీ.. చల్లంగా చూడు తల్లీ..!


పులివెందుల టౌన్ : వన విహారిణిగా వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి


వల్లూరు (చెన్నూరు) : గాయత్రీదేవిగా దర్శనమిస్తున్న జగన్మాత


ముద్దనూరు: అన్నపూర్ణాదేవి అలంకారంలో అమ్మవారు


సింహాద్రిపురం : శ్రీలలితా త్రిపుర సుందరీదేవి అలంకారంలో చౌడేశ్వరి

పులివెందుల టౌన్ : దసరా ఉత్సవాలలో భాగంగా పులివెందుల పట్టణంలో వెలసిన అమ్మవారిశాలలో సోమవారం వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి అమ్మవారు వనవిహారిణి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే రాత్రి శాకాంబరిదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక అలంకరణలలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అలాగే అంకాలమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలలో భాగంగా అమ్మవారు పార్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ చైర్మన్ నాగేంద్ర ప్రసాద్, ఈఓ రమణలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అన్నపూర్ణాదేవి అలంకారంలో అమ్మవారు

కమలాపురం: అమ్మవారిశాలలో కన్యకాపరమేశ్వరీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఐదో రోజు సోమవారం శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారంలో దర్శనమిచ్చి భక్తులను కనువిందు చేశారు. జూటూరు వీర రామయ్య కుటుంబ సభ్యులు అలంకారానికి దాతలుగా వ్యవహరించారు. చాటుకొండు గోపాలకృష్ణ కుటుంబ సభ్యులు అమ్మవారికి పట్టు చీర సమర్పించారు. మహిళా భక్తులు అమ్మవారికి చీరలతో అభిషేకం నిర్వహించారు.

గాయత్రీదేవిగా జగన్మాత

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు మండలం పడమటి వీధిలో చౌడేశ్వరి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఐదవ రోజు సోమవారం గాయత్రిదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. గాయత్రీ దేవిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ వారు తీర్థప్రసాదాలను ఏర్పాటు చేశారు.

ఘనంగా తోటోత్సవం

ముద్దనూరు: శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా సోమవారం భక్తులు ఘనంగా తోటోత్సవం కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారు వనవిహారిణి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో రాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారంలో కొలువుదీరిన అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

శ్రీలలితా త్రిపుర సుందరీదేవి అలంకారంలో..

సింహాద్రిపురం : సింహాద్రిపురం పాతూరు చౌడేశ్వరిదేవి ఆలయంలో దసరా ఉత్సవాలలో భాగంగా సోమవారం శ్రీలలితా త్రిపుర సుందరీదేవి అలంకారంలో చౌడేశ్వరీదేవి అమ్మవారు దర్శనమిచ్చారు.

వైభవంగా దసరా ఉత్సవాలు

వీరపునాయునిపల్లె: మండలంలోని తలపనూరు, గద్దంవారిపల్లె, సంగమేశ్వరాలయంలో ఐదు రోజులుగా దసర ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం తలపనూరు గంగమ్మ తల్లి విశిష్ట లలితాదేవిగా, సంగమేశ్వరాలయంలో పార్వతీదేవి, కీర్తిపల్లె నల్లనమ్మ తల్లి, అనిమెల బోగాదమ్మ తల్లి సరస్వతీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. గద్దంవారిపల్లెలో రాజరాజేశ్వరీదేవి మహా చండీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు.

శ్రీలలితాదేవి అలంకారంలో అమ్మవారు

వేముల : మండలంలోని గొల్లలగూడూరు గ్రామంలో వెలసిన నల్లనమ్మ అమ్మవారు సోమవారం శ్రీలలితాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు, మహిళలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

జగన్మోహిని అలంకారంలో..

వల్లూరు: వల్లూరులోని శ్రీవాసవి ఆర్య వైశ్య కల్యాణ భవనంలో వెలసిన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి జగన్మోహిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి వివిధ రకాల మొక్కలతో ఏర్పాటు చేసిన తోటోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.


వీరపునాయునిపల్లె: మహాచండీదేవి అలంకరణలో రాజరాజేశ్వరీదేవి


వేముల : శ్రీలలితాదేవి అలంకారంలో నల్లనమ్మ


కమలాపురం: కన్యకాపరమేశ్వరీ ఆలయంలో..


వల్లూరు: జగన్మోహిని అలంకారంలో అమ్మవారు